సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



వెలుగులు నింపాలి

చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. - 8లో



ఇసుక దందాను అరికట్టేందుకే..

ఇసుక అక్రమ దందాను అరికట్టేందుకే సాండ్ బజార్ ఏర్పాటు చేసినట్లు మైనింగ్ శాఖ ఎండీ భవేష్ మిశ్రా అన్నారు. - 8లో



విద్యాధికారుల పాత్ర కీలకం

విద్యా కార్యక్రమాల అమలులో ఎంఈఓల పాత్ర కీలకమని వయోజన విద్యా సంచాలకురాలు ఉషారాణి అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

ఆర్‌ఐ, పాలడుగు కార్యదర్శి సస్పెన్షన్

సాక్షి,యాదాద్రి : మోత్కూర్ మండలం పాలడుగు పంచాయతీ కార్యదర్శి శోభన్, ఆర్‌ఐ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హనుమంతరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనర్హులకు కల్యాణలక్ష్మి చెక్కు మంజూరు చేయడంలో కారణం కావడంతో వారిని సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సమగ్రమైన విచారణ చేయాలని భువనగిరి ఆర్డీఓకు ఆదేశాలు జారీ చేశారు.

దాచారం కార్యదర్శి సస్పెన్షన్ ఎత్తివేత

మోత్కూరు : మండలంలోని దాచారం గ్రామ పంచాయతీ కార్యదర్శి బొడ్డు యాదగిరి సస్పెన్షన్ ఎత్తివేస్తూ కలెక్టర్ హనుమంతరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డెయిలీ శానిటేషన్ రిపోర్ట్ ఫేస్ రికగ్నైజేషన్ అటెండెన్స్ ఫేక్ పంపారని ఇటీవల యాదగిరిని సస్పెండ్ చేశారు. ఈయనతో పాటు జిల్లాలో మరో 8 మందిని కూడా సస్పెండ్ చేశారు. ఒక్కో పంచాయతీ కార్యదర్శికి 2, 3 గ్రామాలు అదనపు బాధ్యతలు విధులు నిర్వహిస్తున్నామని తమపై భారం మోపి సస్పెన్షన్ చేస్తే ఎలా అని కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్యదర్శులు ఆందోళన నిర్వహించారు. ఎట్టకేలకు సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ తిరిగి కొనసాగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీఓ బాలాజీ తెలిపారు.

పునఃప్రారంభమైన ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆర్జిత సేవలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు విశేష పర్వాలు జరిగిన నేపథ్యంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలను అధికారులు రద్దు చేశారు. పవిత్రోత్సవాలు ముగిసిన అనంతరం ఆలయ అధికారులు గురువారం ఉదయం ఆర్జిత సేవలను పునఃప్రారంభించారు. పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

జిల్లావ్యాప్తంగా భారీ వర్షం

భువనగిరిటౌన్ : జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి కురిసిన వర్షానికి భువనగిరి పట్టణంలో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అర్ధరాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉండడంతో పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆత్మకూర్ మండలంలో 149 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా.. అడ్డగూడూరు మండలంలో 122, వలిగొండ 105, చౌటుప్పల్ 100, గుండాల 81, ఆలేరు 77, నారాయణపురం 76, రామన్నపేట 76, మోత్కూర్ 60, మోటకొండూరు 50, భువనగిరి 49, రాజాపేట 45, బొమ్మలరామారం 38, బీబీనగర్ 36, పోచంపల్లి 27, తుర్కపల్లి 15, యాదగిరిగుట్ట 12, చౌటుప్పల్‌లో 87 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది.

బ్లాక్‌స్పాట్‌లపై నజర్



బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన పెద్దకందుకూరు రోడ్డు



పెద్దకందుకూరు రోడ్డులో బోలార్డ్స్ ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

- హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై నిత్యకృత్యంగా మారిన ప్రమాదాలు
- నివారణపై దృష్టి సారించిన హైవే, పోలీస్ శాఖ
- ఆయా ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లు, సూచిక బోర్డుల ఏర్పాటుకు సన్నాహాలు

హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. వీటి నివారణకు హైవే, పోలీస్ శాఖ దృష్టి సారించింది. అధికంగా ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో బోలార్డ్స్, రేడియం స్టిక్కర్లు, సూచికలు తదితర ఏర్పాట్లు, స్పీడ్ గన్ల ఏర్పాటు చేయనున్నారు.

యాదగిరిగుట్ట రూరల్: హైదరాబాద్– వరంగల్ ప్రధాన జాతీయ రహదారి – 163 యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ పరిధి నుంచి ఆలేరు ప్రాంతం వరకు విస్తరించి ఉంటుంది. ఈ రహదారిలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. యేడాది కాలంలో 110 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, 13 మంది మృత్యువాత పడ్డారు. రోడ్డు ప్రమాదాల నివారించేందుకు పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

8 బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపు

యాదగిరిగుట్ట మండల పరిధిలో 8 బ్లాక్ స్పాట్ (ప్రమాదాలు జరిగే ప్రాంతం)లను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. వంగపల్లి గ్రామం లోపలికి వచ్చే రహదారి, వంగపల్లి బైపాస్, రామాజీపేట గ్రామం, తాళ్లగూడెం బస్‌స్టాప్, బాహుపేట స్టేజీ, చిన్నకందుకూరు స్టేజీ, పెద్దకందుకూరు గ్రామం, ఆలేరు ఎగ్జిట్ ప్రదేశం ప్రమాదాలు అధికంగా జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రదేశాల్లో బ్లాక్అండ్ ఎల్లో హజార్డ్, డెలిరేషన్ బోర్డులు, మీడియన్ స్టార్టింగ్ బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు, ప్లాస్టిక్ స్టాపర్‌లు, పవర్ బ్లింకర్‌లు, గో స్లో, ఆక్సిడెంట్ ఇండికేషన్‌లు, వంటి బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

అతివేగంతో వచ్చి ప్రమాదాల బారిన..

ఆలేరురూరల్: ఆలేరు నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో సాయిబాబ గుడి సమీపంలో, కందిగడ్డ తండా సమీపంలో నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. గతేడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృత్యువాత పడగా.. 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్పీడ్ బ్రేకర్లు వేసిన చోట్ల రేడియంతో గుర్తులు లేకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు అతివేగంతో వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు.

స్పీడ్‌గన్లు ఏర్పాటు చేస్తాం



వరంగల్–హైదరాబాద్ ప్రధాన రహదారిలో ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో కంటే ప్రమాదాల సంఖ్య తగ్గించాం. ప్రమాదాలు జరిగే చోట బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, ఇండికేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. వాహనాలు 80 స్పీడ్ దాటితే జరిమానాలు పడేలా, స్పీడ్ గన్‌లను కూడా త్వరలో ఏర్పాటు చేస్తాం. ప్రత్యేకంగా రాచకొండ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో బ్లాక్ స్పాట్‌లను గుర్తించాం. ఇప్పటికే కొన్ని ఇండికేషన్ బోలార్డ్స్ కూడా పెట్టాం.

– యెలగొండ కృష్ణ, ట్రాఫిక్ సీఐ, యాదగిరిగుట్ట సర్కిల్



ప్రమాదాలు జరిగే స్థలంగా గుర్తించిన హైవే నుంచి ఆలేరు టౌన్‌లోకి వెళ్లే దారి

నాలుగు చోట్ల అధిక ప్రమాదాలు



కొండమడుగు జాతీయ రహదారి

బీబీనగర్: మండలంలోని కొండమడుగు మెట్టు నుంచి గూడూరు వరకు ఆరు కిలోమీటర్ల మేర వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి ఉంది. గతేడాది నుంచి ఇప్పటివరకు ఈ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ప్రధానంగా కొండమడుగు మెట్టు, గూడూరు బస్టాప్, ఎయిమ్స్ వైద్య కళాశాల, బీబీనగర్‌లోని ప్రధాన చౌరస్తా వద్ద అండర్ పాస్‌లు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

గతంలోనే బ్లాక్‌స్పాట్‌గా గుర్తింపు



భువనగిరిలోని జగదేవ్‌పూర్ చౌరస్తా

భువనగిరిటౌన్ : భువనగిరిలోని హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి 163పై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. భువనగిరి పట్టణంలోని రామచంద్రపురం రోడ్డు, జగదేవ్‌పూర్ రోడ్డును గతంతోనే డెత్ స్పాట్‌గా గుర్తించారు. పగిడిపల్లి ఎల్లమ్మ గుడి వద్ద రెండు వైపులా వాహనాలను ఎదురెదురుగా అనుమతించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

'వరలక్ష్మి' సెల్ఫీలకు ఆహ్వానం

శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతం జరుపుకునే మహిళలూ.. మీ ఫొటోలను 'సాక్షి' పత్రికలో చూసుకోవాలను కుంటున్నారా.. మీరు పూజలో కూర్చున్న ఫొటో సెల్ఫీ తీసి ఈ కింద నంబర్‌కు వాట్సప్ చేయండి. శనివారం సంచికలో ప్రచురిస్తాం. లేటెస్ట్ సెల్ఫీ ఫొటోతో పాటు మీ పేరు, చిరునామా కూడా పంపాలి.

సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నంబర్

80962 93702



కాలానికి అనుగుణంగా డిజైన్లు రూపొందించాలి



చేనేత కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరిటౌన్ : మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత డిజైన్లు రూపొందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాయగిరి క్రాస్ రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు చేనేత కార్మికులు చేపట్టిన ర్యాలీని, కలెక్టర్ హనుమంత రావు, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర రావు, ఏడీ హ్యాండ్లూమ్ శ్రీనివాస్ ప్రారంభించారు. చేనేత కళను కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇక్కత్ వస్త్రాలు ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచాయన్నారు. ఫ్యాషన్‌కు తగ్గట్టుగా వస్త్రాలు తయారు చేస్తే మార్కెటింగ్ బాగా పెరుగుతుందని తెలిపారు చేనేత రంగాన్ని ప్రోత్సహించే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఇచ్చే విధంగా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నేతన్నకు చేయూత, నేతన్న బీమా చెక్కులను అందజేశారు. చేనేత రంగంలో విశేష కృషి చేసిన నేతన్నలను సన్మానించి, మెమొంటో అందజేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, చేనేత సహకార సంఘం ప్రెసిడెంట్ జల్ది రాములు, కార్మిక సంఘ నాయకుడు లక్ష్మీనరసయ్య, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు సుధాకర్, చేనేత సహకార సంఘం ప్రెసిడెంట్ సుధాకర్ సుదర్శన్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గుట్టలో పదోన్నతుల వివాదం

- నిలిచిపోయిన అర్చకుల పదోన్నతులు
- పెండింగ్‌లో ప్రధానార్చకుడి పోస్టు

సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట దేవస్థానంలో అర్చకుల పదోన్నతుల ప్రక్రియ చర్చనీయాంశంగా మారింది. ప్రధానార్చకుడి నియామక ప్రక్రియ నిలిచిపోవడంతో నలుగురు అర్చకుల పదోన్నతులు ఆగిపోయాయి. గుట్ట దేవస్థానంలో రెండు ప్రధానార్చకుల పోస్టులు ఉన్నాయి. మొదటి ప్రధానార్చకులుగా నల్లందీఘల్ లక్ష్మీనర్సింహాచార్యులు, రెండో ప్రధానార్చకులుగా కాండూరి వెంకటాచార్యులు ఉన్నారు. వీరిలో జూలై 31న నల్లంథీఘల్ లక్ష్మీనర్సింహాచార్యులు పదవీ విరమణ పొందారు. ఖాళీ అయిన ఈ పోస్టును ఉప ప్రధానార్చకునితో వెంటనే భర్తీ చేయాల్సి ఉంది. దేవాలయంలో ఉన్న నలుగురు ప్రధానార్చకుల్లో సీనియర్‌కు అవకాశం ఇవ్వాలి. అయితే, ప్రస్తుతం ప్రధానార్చకుడి నియామకం పెండింగ్‌లో ఉంది. ఉప ప్రధాన అర్చకుడికి పదోన్నతి కల్పిస్తే ఉప ప్రధానార్చక పోస్టు ఖాళీ అవుతుంది. ఈ పోస్టును ముఖ్య అర్చకుడితో భర్తీ చేస్తే, ఆయనస్థానంలో అర్చకుడు ముఖ్య అర్చకుడు అవుతాడు. అర్చకుడు ఖాళీ అయితే పరిచారకుడు అర్చకుడుగా పదోన్నతి పొందుతారు.

కొనసాగుతున్న హైడ్రామా

జూలై 31న ఖాళీ అయిన ప్రధానార్చకుని పోస్టును భర్తీ చేయడంలో హైడ్రామా కొనసాగుతోంది. ఆ ప్రక్రియను ఏ కారణం చేతనో పెండింగ్‌లో ఉంచారు. ఇప్పటికే దేవస్థానంలో గత కొన్నేళ్లుగా స్థానాచార్యుల పోస్టు ఖాళీగా ఉంది. మరో వైపు అర్హత కలిగిన ఉప ప్రధానార్చకులలోంచి ఒకరికి ప్రధానార్చకునిగా పదోన్నతి ఇవ్వాలని అర్చకులు ఈవోను కలిసి నివేదించారు. అందరి అభిప్రాయాలు విన్న ఈఓ త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని సమాచారం. అయితే, శుక్రవారం ఈఓ తీసుకునే నిర్ణయంపై దేవస్థానంలో ఉత్కంఠ నెలకొంది. దేవస్థానంలో ఇద్దరు ప్రధానార్చకులు అవసరమా అన్న చర్చకు కొందరు తెరతీశారు. మరో వైపు పదవీ విరమణ చేసిన నల్లంథీఘల్ తన పదవీకాలాన్ని పొడిగించాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అందువల్లే పదోన్నతులు నిలిచిపోయాయని ఓ వాదన ఉంది.

15లోగా పెండింగ్ కేసుల పరిష్కారం

- సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సహ కమిషనర్లు

సాక్షి,యాదాద్రి : సమాచార హక్కు చట్టం కింద పెండింగ్‌లో ఉన్న పిటిషన్లు ఈ నెల 15లోగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. జనగామ జిల్లా పర్యటనకు వెళ్తున్న ఆయన గురువారం భువనగిరి వివేరా హోటల్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పిటిషన్లు 18,000 పెండింగ్‌లో ఉండగా, వీటిలో ఇప్పటివరకు 2300 పిటిషన్లను పరిష్కరించామన్నారు. మొత్తం 29 డిపార్ట్ మెంట్లలో పెండింగ్‌లో ఉన్న పిటిషన్లలో 15 శాఖల్లో క్లియర్ చేశామని చెప్పారు. మిగిలిన 14 శాఖల్లో దరఖాస్తులను పరిష్కరించేందుకు ముమ్మర చర్యలు చేపట్టామన్నారు. ప్రధానంగా మున్సిపల్ రెవెన్యూ శాఖలో ఉన్న 50 శాతం పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ఆయాశాఖలకు ఆదేశాలిచ్చామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిటిజన్ చార్టర్లు విధిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఆయన వెంట సహ కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్, నెర్ల వైష్ణవి మొహిసిన్ పర్వీన్ ఉన్నారు.

రాఖీ పౌర్ణమికి అదనపు బస్సులు

రామగిరి(నల్లగొండ): రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ అదనపు బస్సులు నడుపుతున్నట్లు ఆ సంస్థ రీజనల్ మేనేజర్ (ఆర్‌ఎం) కె.జానిరెడ్డి తెలిపారు. పండుగ రద్దీ ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రయాణికుల సౌకర్యార్థం ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల నుంచి సుమారు 150 నుంచి 170 వరకు అదనంగా బస్సులను నడపనున్నట్టు పేర్కొన్నారు. సూర్యాపేట, మిర్యాలగూడ, నల్లగొండ ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీ నగర్ స్పెషల్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా కంట్రోలర్స్, సూపర్‌వైజర్లను నియమించామని పేర్కొన్నారు. ప్రయాణికులు అదనపు బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయవంతంగా మాస్ ప్లాంటేషన్

భువనగిరిటౌన్ : వన మహోత్సవంలో భాగంగా గురువారం నిర్వహించిన మాస్ ప్లాంటేషన్ విజయవంతంగా పూర్తయిందని, ఒక్క రోజులోనే 2లక్షల మొక్కలు నాటినట్లు కలెక్టర్ హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో మొత్తం 20 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకోగా, బుధవారం వరకు 14 లక్షల మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. గురువారం రోజున జిల్లా వ్యాప్తంగా మొత్తం 2లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌ది ఓటు బ్యాంకు రాజకీయం



భువనగిరి ప్రధాన రహదారి మీదుగా బైకు ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

- కామారెడ్డి డిక్లరేషన్ అమలు ఎక్కడ
- కార్యరూపం దాల్చని మూసీ ప్రక్షాళన
- భువనగిరిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

సాక్షి, యాదాద్రి, భువనగిరి : బీసీ రిజర్వేషన్ల పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత గురువారం తొలిసారిగా ఆయన జిల్లాలో పర్యటించారు. ఈసందర్భంగా భువనగిరిలోని ఎంఎస్‌ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడారు. ముస్లిం ఓటుబ్యాంకుతో రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందే తప్ప కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయడం చేతకావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చింది బీసీ బిల్లు కాదని అది ముస్లిం రిజర్వేషన్ బిల్లు అని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ కి భారీగా సీట్లు వస్తాయనే సంకేతాలున్నాయన్నారు. రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మూసీ ప్రక్షాళన చేస్తా అనే మాటలు కార్యరూపం దాల్చలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు రెండు ఒక్కటేనని, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసుల్లో ఏ ఒక్క రాజకీయ నాయకుడిని అరెస్ట్ చేయలేదన్నారు. భువనగిరి నుంచి ధర్మయుద్ధం ప్రారంభించి వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు అధికారం ఇచ్చిన ప్రజలు ఒకసారి బీజేపీకి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. అనంతరం బీజేపీ శ్రేణులు రాంచందర్‌రావును ఘనంగా సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా ప్రభారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, సంస్థాగత జిల్లా స్థానిక ఎన్నికల ప్రభారి పాశం భాస్కర్,బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర నాయకులు తాడూరి శ్రీనివాస్, పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్, పోతంశెట్టి రవీందర్, దాసిర మల్లేష్, నర్ల నర్సింగ్‌రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి, జాతీయ దళిత మోర్చా కార్యవర్గసభ్యులు వేముల అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, పట్టణ, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

భారీ బైకు ర్యాలీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు ఆ పార్టీ నేతలు స్థానిక పాత బస్టాండ్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి వినాయక, ప్రిన్స్ చైరస్తా మీదగా ఆజాద్ రోడ్డు మార్గంలో సమ్మద్ చౌరస్తా మీదుగా ఎంఎస్‌ఆర్ గార్డెన్‌కు చేరుకున్నారు.

నృసింహుడి ఆలయ భద్రతపై ఆందోళన

- గతంలో ఆలయ ప్రసాద విభాగంలో చింతపండు, పాతగోశాల డార్మెంటరీ హాల్‌లో వైర్ల చోరీ
- ఇటీవల గిరి ప్రదక్షిణ మార్గంలో విద్యుత్ స్తంభాలు అపహరించేందుకు యత్నం
- పర్యవేక్షణ లోపించడంతోనే దొంగతనాలకు పాల్పడుతున్నారని భక్తుల ఆరోపణ



ఆలయ గిరి ప్రదక్షిణ మార్గంలో విద్యుత్ స్తంభాలను రంపంతో కోసిన దృశ్యం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో ఆలయంలో చింతపండు దొంగతనం, ఆలయ పరిసరాల్లోని గిరి ప్రదక్షిణ, పాతగోశాలలోని డార్మెంటరీ హాల్‌లో వైర్ల చోరీలు జరిగాయి. అయినా ఆలయ పోలీసులు, అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ప్రస్తుతం ఆలయ గిరి ప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను చోరీ చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు రంపంతో కోసారు.

గతేడాది బిగించినప్పటికీ..

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సుమారు రూ.20లక్షల వ్యయంతో ఈసీఐఎల్ కంపెనీతో సుమారు 100 విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలను బిగించారు. గతేడాది ఇవి బిగించినప్పటికీ వీటి పర్యవేక్షణపై ఎస్‌పీఎఫ్ పోలీస్, స్థానిక పోలీసులు సరైనా నిఘా పెట్టడం లేదు. దీంతో గిరి ప్రదక్షిణ మార్గంలో బిగించిన విద్యుత్‌స్తంభాలను గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 10 నుంచి 15 చోట్లా రంపంతో కట్ చేశారు. గుర్తించిన విద్యుత్ సిబ్బంది ఆ స్తంభాలను ఆలయ మీటర్ యార్డు గదిలో భద్రపరిచారు. మరికొన్ని చోట్ల అలాగే వదిలేశారు. వాటిని సైతం రాత్రి సమయంలో దుండగులు దొంగిలించేందుకు యత్నిస్తున్నారు.

గతంలో సైతం..

ఆలయ సన్నిధిలోని పాత గోశాలలో గతంలో భద్రపరిచిన విద్యుత్ వైర్‌ను దొంగిలించుకుపోయారు. ఇటీవల సుమారు 120 మీటర్లకు పైగా వైర్‌ను సైతం దుండగులు అపహరించుకుపోయారు. గత మూడు నెలల క్రితం ఆలయ ప్రసాద విభాగంలో సైతం చింతపండును దొంగిలిస్తూ ఔట్ సోర్సింగ్ సిబ్బంది పట్టుబడ్డారు. ఇందంతా సరైన పర్యవేక్షణ, నిఘా లేకపోవడంతోనే జరుగుతుందనే అనుమానాలు భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి.

ఈసీఐఎల్ కంపెనీకి బిల్లులు ఇవ్వకపోవడంతో..

ఆలయ గిరి ప్రదక్షిణ మార్గంలో ఈసీఐఎల్ కంపెనీ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల పనులకు అధికారులు బిల్లులు చెల్లించకపోవడంతో పాటు వీటి నిర్వహణను ఆలయ అధికారులకు అప్పగించలేదని సమాచారం. దీంతో విద్యుత్ స్తంభాలు విరిగినా, ఎవరైనా దొంగిలించినా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈసీఐఎల్ కంపెనీకి దేవస్థానం బిల్లులు చెల్లిస్తే, వీటి నిర్వహణ ఆలయ అధికారులు చూసుకునే అవకాశం ఉంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం

గిరి ప్రదక్షిణ మార్గంలో ఈఓతో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ఈ మార్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు సంబంధించిన బిల్లులు ఇవ్వలేదనే నెపంతో ఈసీఐఎల్ కంపెనీ పూర్తి స్థాయిలో నిర్వహణ చేయలేకపోతోంది. రాత్రి సమయాల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బందితో గిరి ప్రదక్షిణ మార్గంలో నిఘా ఏర్పాటు చేస్తాం. రంపంతో కోసి పక్కన పెట్టిన విద్యుత్ స్తంభాలను మీటర్ యార్డు గదిలో భద్రపరిచాం.

– రామారావు, ఈఈ విద్యుత్ విభాగం

క్లుప్తంగా

న్యాక్ ఎ గ్రేడ్ కోసం ప్రణాళిక రూపొందించాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ న్యాక్ గ్రేడింగ్‌లో ఎ గ్రేడ్ సాధించేలా అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులు ప్రణాళికలు సిద్ధం చేయాలని వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం యూనివర్సిటీలో వివిధ విభాగాల ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాక్‌కు అందించే సెల్ఫ్ స్టడీ నివేదికలోని అంశాలపై అధ్యాపకులు అవగాహన కల్గి ఉండాలన్నారు. ప్రతి విభాగం వారు విధిగా వర్క్‌షాపులు, సెమినార్ల నిర్వహణతో పాటు పరిశోధనల వైపు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. పీహెచ్‌డీ విద్యార్థులు తమ పరిశోధనా కాలంలో కనీసం 2 పరిశోధనా పత్రాలు పరిశీలించాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి విభాగాల వారీగా ఉత్తమ విద్యార్థులు, ఉత్తమ అధ్యాపకులను ఎంపిక చేస్తామన్నారు. అధ్యాపకులు సమయపాలన పాటించాలన్నారు., సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, సీఓఈ డాక్టర్ ఉపేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రేమ్‌సాగర్, డాక్టర్ కె. అరుణప్రియ, సీహెచ్. సుధారాణి, శ్రీదేవి, రేఖ, అంజిరెడ్డి, ఆకుల రవి, హరీష్‌కుమార్, డాక్టర్ వై. ప్రశాంతి, మిర్యాల రమేష్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల నియామకం



వెంకటరమణారెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: ఎంజీయూలో వివిధ విభాగాల్లో సిలబస్ కూర్పు, పాఠ్యాంశాల రూపకల్పన, పరీక్షల నిర్వహణ విధానం, వివిధ విద్యాంశాల ప్రణాళిక రూపకల్పనకు గాను బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లను నియమిస్తూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బిజినెస్ మేనేజిమెంట్ విభాగం చైర్మన్‌గా మారం వెంకటరమణారెడ్డి, సోషల్ వర్క్ చైర్మన్‌గా డాక్టర్ శ్రీధర్(ఓయూ), హిస్టరీ అండ్ టూరిజం విభాగం చైర్మన్‌గా కె. విజయ్‌బాబు(కాకతీయ యూనివర్సిటీ), పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చైర్మన్‌గా ఏవీఎస్.రెడ్డి(అంబేడ్కర్ యూనివర్సిటీ)ని నియమించారు.

నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపాలి



పోచంపల్లి చేనేత సహకార సంఘంలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న బండారు దత్తాత్రేయ



పోచంపల్లిలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బండారు దత్తాత్రేయ

- హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

భూదాన్‌పోచంపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములుతో కలిసి భూదాన్‌పోచంపల్లిని ఆయన సందర్శించారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చేనేత కార్మికులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేనేత సహకార సంఘం, చేనేత గృహాలను సందర్శించారు. చేనేత వస్త్రాలు, మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నది చేనేత పరిశ్రమనే అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అందరూ తప్పనిసరిగా చేనేత వస్త్రాలు ధరించాలనే నిబంధనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తే చేనేత కార్మికుల వస్త్రోత్పత్తులకు మార్కెటింగ్ పెరుగుతుందన్నారు. చేనేత సహకార సంఘాలను బలోపేతం చేయాలని, సబ్సిడీపై నూలు, ముడిసరుకును అందించి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి పోచంపల్లికి మెగా చేనేత క్లస్టర్ మంజూరుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మోదీ ప్రధాని అయిన తర్వాతే జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రకటించారని వివరించారు. చేనేత సహకార సంఘాలకు ఆద్యుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. చేనేత పరిశ్రమలో 70శాతం మహిళలు పనిచేడం గొప్పవిషయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా, వారి పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని కోరారు. దేశంలో తెలంగాణ నుంచే రూ.3లక్షల కోట్ల విలువైన చేనేత వస్త్రాలు ఎగుమతి అవుతున్నాయంటే మన చేనేత వస్త్రాలకు ఉన్న డిమాండ్ అర్థమవుతుందని అన్నారు. అనంతరం పలువురు చేనేత నాయకులు, కార్మికులు బండారు దత్తాత్రేయను సన్మానించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో చేనేత రాష్ట్ర నాయకులు కర్నాటి ధనుంజయ్య, ఎన్నం శివకుమార్, భారత లవకుమార్, సతీష్, నోముల గణేశ్, భారత వాసుదేవ్, చిక్క కృష్ణ, అంకం పాండు, సీత శ్రీరాములు, సీత సత్యనారాయణ, కర్నాటి బాలరాజు, రుద్ర అంజనేయులు, మెరుగు శశికళ, కర్నాటి అంజమ్మ, గంజి బస్వలింగం, ఏలే శ్రీనివాస్, కేసారం కృష్ణారెడ్డి, బడుగు శ్రీకాంత్, కడవేరు శేఖర్, ఇంజమూరి యాదగిరి, భారత అంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డులు అందుకున్న చేనేత కళాకారులు





సంస్థాన్ నారాయణపురం: కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పుట్టపాక చేనేత కళాకారులు గూడ పవన్, గజం నర్మద

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన గూడ పవన్ యువ చేనేత విభాగంలో, జాతీయ చేనేత మార్కెటింగ్ విభాగంలో గజం నర్మద జాతీయ అవార్డు అందుకున్నారు. గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యూఢిల్లీలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, సహాయ మంత్రి పబిత్ర మార్గరేటా తదితరుల చేతులమీదుగా వారు అవార్డు అందుకున్నారు. వారికి ప్రశంసాపత్రం పత్రం, మెమొంటోతో పాటు నగదు పురస్కారం అందజేశారు.

భూదాన్‌పోచంపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన చేనేత సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేసినందుకు గాను హైదరాబాద్ వీవర్స్ సర్వీస్ సెంటర్ రీజినల్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ స్కీమాటిక్ ఇంప్లిమెంటేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హ్యాండ్లూమ్ విభాగంలో జాతీయ అవార్డు అందుకున్నారు.



భూదాన్ పోచంపల్లి: జాతీయ అవార్డు అందుకుంటున్న అరుణ్‌కుమార్

ఇసుక దందాను అరికట్టేందుకే 'సాండ్ బజార్'



సాండ్ బజార్‌ను ప్రారంభిస్తున్న మైనింగ్ శాఖ ఎండీ భవేష్‌మిశ్రా, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

- రాష్ట్ర మైనింగ్ శాఖ ఎండీ భవేష్ మిశ్రా

మిర్యాలగూడ: ఇసుక అక్రమ దందాను అరికట్టి సామాన్యులకు అందుబాటు ధరలో ఇసుక అందించడానికే సాండ్ బజార్‌ను ఏర్పాటు చేసినట్లు అన్నారు. రాష్ట్ర మైనింగ్ శాఖ ఎండీ భవేష్ మిశ్రా అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో రాష్ట్ర మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాండ్ బజార్‌లో టన్ను ఇసుక రూ.1250కు అందుబాటులో ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంకా తక్కువ ధరకే ఇసుకను అందించేందుకు సాండ్ బజార్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తక్కువ ధరకు ఇసుకతో పాటు స్థానిక సిమెంట్ పరిశ్రమ యాజమాన్యాలతో మాట్లాడి సిమెంట్ బస్తాకు రూ.50 చొప్పున తగ్గింపు ధరలో అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇటుకలు కూడా మార్కెట్ ధర కంటే ఒక రూపాయి తక్కువకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ శాఖ ఏడీ జాకోబ్, తహసీల్దార్ సురేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

నల్లగొండ టూటౌన్: 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఎంజీయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు 20 అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ హరీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ యూనివర్సిటీ సూచన ప్రకారం విద్యార్థుల జాబితా సిద్ధం చేసి ఈ నెల 15 లోగా usbmguict 2025@gmail.com మెయిల్ కు పంపాలని సూచించారు.

వాగులో పడి మహిళ మృతి



నాగమ్మ (ఫైల్)

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): వాగులో పడి మహిళ మృతిచెందిన ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరులో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన పచ్చిపాల నాగమ్మ (45) మూడ్రోజుల క్రితం మోతె మండలం సర్వారంలో బంధువుల దశదినకర్మకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తూ.. ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరు గ్రామ పరిధిలోని వాగులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు దిగి కాలు జారి వాగులో పడింది. గురువారం ఉదయం స్థానికులు వాగు వద్దకు వెళ్లగా మహిళ మృతదేహం నీటిపై తేలుతుండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటాం



యాదగిరిగుట్ట ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న రాంచందర్‌రావు



జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొని మాట్లాడుతున్న రాంచందర్‌రావు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

యాదగిరిగుట్ట: చేనేత కార్మికులకు బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని ఆయన దర్శించుకొని, అనంతరం పట్టణంలోని బీసీ కాలనీలో నిర్వహించిన 11వ జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం విదేశీ మోజులో చేనేత దుస్తులను ఎవరూ ధరించకపోవడంతో ఇతర ప్రాంతాలకు చేనేత కార్మికులు వెళ్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేనేత కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముద్ర పథకం కింద కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రుణాలు అందించి ఆదుకుంటుందన్నారు. చేనేత వస్త్రాలను విదేశాలకు పంపించే అవకాశం ప్రధాని నరేంద్ర మోదీ కల్పించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోలేదన్నారు. కానీ ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేత కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. చేనేత వస్త్రాలు ధరించాలనే సంకల్పం ప్రతి వ్యక్తిలో రావాలన్నారు. చేనేత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సరైన పథకాలు అమలు చేయడంలేదన్నారు. పవర్‌లూమ్స్ కార్మికుల జీవితాలు దుర్భర స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. మొదటిసారి యాదగిరిగుట్టకు ఆయనకు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్, దాసరి మల్లేశం, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, చేనేత విభాగం మాజీ కన్వీనర్ కర్నాటి ధనుంజయ్య, ఎన్నం శివకుమార్, మచ్చ సుధాకర్, రచ్చ శ్రీనివాస్, గంజి బసవలింగం, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదు

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

రామన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. గురువారం రామన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. బీసీలను మభ్యపెట్టడానికే రేవంత్‌రెడ్డి 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తెచ్చారని, మేధావులను, ప్రతిపక్షాలను సంప్రదించకుండా ఆర్డినెన్స్‌ను రూపొందించారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డిపై నమ్మకం లేకనే ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదని అన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలులో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ 42శాతం నామినేటెడ్ పదవులు బీసీలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. చంద్రబాబు కనుసన్నల్లో తెలంగాణలో పాలన సాగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పోచబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, నాయకులు బద్దుల రమేష్, సాల్వేరు అశోక్, వేమవరపు సుధీర్‌బాబు తదితరులు ఉన్నారు.

చేనేతకు ప్రభుత్వాలన్నీ అన్యాయం చేశాయి

- మాజీ ఐఏఎస్ అధికారి, బీసీ మేధావుల ఫోరమ్ చైర్మన్ చిరంజీవులు

భూదాన్‌పోచంపల్లి: గత ప్రభుత్వాలన్నీ చేనేత కార్మికులకు తీవ్ర అన్యాయం చేశాయని మాజీ ఐఏఎస్ అధికారి, బీసీ మేధావుల ఫోరమ్ చైర్మన్ టి.చిరంజీవులు అన్నారు. గత పదేళ్ల కాలంలో రూ.18లక్షల 12వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు ఖర్చు చేసింది కేవలం రూ.229 కోట్లు మాత్రమేనని అన్నారు. అలాగే ఈ సంవత్సరం 50లక్షల 512 వేల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా చేనేతకు రూ.2400 కోట్లు కేటాయించడం దయనీయ పరిస్థితికి అద్దంపడుతోందని అన్నారు. గురువారం సాయంత్రం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవులు పాల్గొని మాట్లాడుతూ.. చేనేత కార్మికుల రుణమాఫీ చేయడానికి ప్రభుత్వాలకు చేతులు రావడం లేదన్నారు. అదే గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం బడాపారిశ్రామిక వేత్తలకు రూ.16లక్షల 24వేల కోట్లు మాఫీ చేసిందని విమర్శించారు. 1950 నుంచి ఇప్పటి వరకు 23 మంది మాత్రమే పద్మశాలీలు ఎమ్మెల్యేలు అయ్యారని అన్నారు. వాస్తవానికి 69 మంది ఎమ్మెల్యే కావాలన్నారు. అందరూ ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పద్మశాలి కార్మిక సంఘం ఆధ్వర్యంలో 30 మంది చేనేత కార్మికులను సన్మానించారు. కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, చేనేత నాయకులు భారత లవకుమార్, ఎన్నం శివకుమార్, సీత శ్రీరాములు, భోగ భానుమతి, కర్నాటి అంజమ్మ, మెరుగు శశికళ, కార్మిక సంఘం నాయకులు హరిశంకర్, భూషణ్, బిట్ల గణేశ్, రుద్ర సూర్యప్రకాశ్, వేణుకుమార్, శ్యామ్‌సుందర్, కూరపాటి భాస్కర్, శివరాజు, రాజేశ్వరీ, హేమలత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ మేధావుల ఫోరమ్ చైర్మన్ టి.చిరంజీవులు

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

కోదాదరూరల్: కుటుంబ కలహాలతో ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కోదాడ పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం కోదాడ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణ పరిధిలోని చేపల మార్కెట్ వెనుక కట్టబజార్‌కు చెందిన ఉప్పతల శ్రీను, లక్ష్మి(40) దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు సంతానం. శ్రీను మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే కారణంతో భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో లక్ష్మిని శ్రీను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. మూడు రోజుల నుంచి భార్యాభర్తలు మాట్లాడుకోవడం లేదు. బుధవారం రాత్రి వారి కుమార్తె హాసిని, బంధువుల పాప కలిసి ఓ గదిలో నిద్రించగా.. మరో గదిలో నిద్రించిన లక్ష్మి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి కుమార్తె హాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ శివశంకర్ తెలిపారు. శ్రీను మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని లక్ష్మిని కొట్టి చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని బంధువులు ఆరోపిస్తున్నారు. పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

పెళ్లి కుదరడం లేదని బలవన్మరణం



రూప (ఫైల్)

డిండి: పెళ్లి కుదరడం లేదని మనస్తాపానికి గురైన యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం డిండి మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల కేంద్రంలోని డీఎస్‌టీ కాలనీకి చెందిన పెంద్ర లక్ష్మయ్య, జంగమ్మ దంపతుల కుమార్తె రూప(26) డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటూ కుట్టుమిషన్ నడుపుతోంది. కొన్ని సంవత్సరాల నుంచి కుటుంబ సభ్యులు రూపకు పెళ్లి సంబంధాలు చూస్తున్నప్పటికీ కుదరడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన రూప బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

250 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు

- ఎస్కార్ట్ వాహనంతో రెండు కార్లలో ఢిల్లీకి తరలిస్తున్న నిందితులు
- ఒకరి అరెస్ట్, ఐదుగురు పరారీ
- రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి

చిట్యాల: కారులో 250 కిలోల గంజాయి తరలిస్తుండగా చిట్యాల పట్టణంలో గురువారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డి విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. నార్త్ ఈస్ట్ ఢిల్లీకి చెందిన మోనిస్ అలియాస్ రాహుల్ మిశ్రా కొంతమందిని యువకులను చేరదీసి ఆంధ్రా–ఒరిస్సా బార్డర్‌లోని అనకాపల్లి నుంచి గంజాయిని ఢిల్లీకి రవాణా చేస్తున్నాడు. ఇందుకుగాను యువకులకు ఒక్కొక్కరికి రూ.20వేలతో పాటు గంజాయి రవాణాకు అవసరమైన కార్లను ఏర్పాటు చేస్తున్నాడు. గురువారం తెలవారుజామున ఐదు గంటల సమయంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాలలోని సుజన థియేటర్ సమీపంలో ఢిల్లీ నంబర్ ప్లేట్‌తో ఉన్న కారు ఆగి ఉండడంతో పెట్రోలింగ్ చేస్తున్న చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ మల్లేష్, కానిస్టేబుల్ వెంకన్న కారు వద్దకు చేరుకున్నారు. కారులోని ముగ్గురు వ్యక్తులను విచారించగా.. అందులో 250 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అంతకంటే ముందే మరో కారులో 250 కిలోల గంజాయితో తమకు సంబంధించిన వ్యక్తులు వెళ్లిపోయారని, తమకు ఎస్కార్ట్‌గా ఉన్న కారు వెనుక ఉండడంతో దాని కోసం వేచి ఉన్నట్లు నిందితులు పేర్కొన్నారు. ఇంతలోనే ఎస్కార్ట్‌గా వస్తున్న కారు అక్కడికి రావడంతో పోలీసులు దానిని ఆపే ప్రయత్నం చేశారు. డ్రైవర్ ఎస్కార్ట్ కారును ఆపకుండగా గంజాయితో పట్టుబడిన కారులోని ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరిని ఎక్కించుకుని యూటర్న్ తీసుకుని కట్టంగూర్ వరకు వెళ్లి కురుమర్తి రోడ్డులో కారును వదిలి పారిపోయారు. నార్త్ ఈస్ట్ ఢిల్లీకి చెందిన నూర్ మొహమ్మద్ అలియాస్ రాజు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితుడి ద్వారా పారిపోయిన వారు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీకు చెందిన బబ్లూ, మంగల్, ఢిల్లీకి చెందిన జమీల్, భాను, కన్హాయి అధికారిగా పోలీసులు గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారుగా రూ.65లక్షల ఉంటుందని డీఎస్పీ తెలిపారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నంబర్ ప్లేట్స్ మార్చుతూ..

ఢిల్లీ రిజిస్ట్రేషన్ నంబర్ గల కార్లను మోనిస్ ఉపయోగిస్తున్నాడు. కానీ గంజాయి తరలించే క్రమంలో ఏపీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్స్‌ను కార్లుకు ఏర్పాటు చేసి, ఏపీ బార్డర్ దాటి తెలంగాణకు వచ్చిన తర్వాత తిరిగి ఢిల్లీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్స్‌ను అమర్చేవారు. పోలీసులకు చిక్కకుండా నంబర్ ప్లేట్స్ మార్చుతూ గంజాయి తరలిస్తున్నట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ మల్లేష్, కానిస్టేబుల్ వెంకన్నకు రివార్డు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పారిపోయిన వారిని త్వరలోనే పట్టుకుంటామని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.